# టెర్రా - 205

1

మధుబాబు



# టెర్రా-205

(షాడో స్పై ఎడ్వెంచర్)

రచన

మధుబాబు

Kinige

© Author
© Madhu Baabu
This digital book is published by -
కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

All rights reserved.

No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.

# మొదటి భాగం

చెవులు చిల్లులు పడిపోయేటట్లు దారుణమైన బుసను వెలువరిస్తూ పది అడుగుల ఎత్తుకు పడగను లేపింది ఆ రాజసర్పం.

ఆ చుట్టపట్ల వున్న చెట్లమీద కూర్చుని తాపీగా ముక్కులతో రెక్కల్ని దువ్వుకుంటున్నాయి రకరకాల అడవి పక్షులు. తుపాకీ పెట్టి కొట్టినట్లు ఒక్కసారిగా చెల్లాచెదరైనాయవి. ఆ పరిసర ప్రాంతాల్లో ఎక్కడా కనిపించకుండా మటుమాయం అయిపోయాయి.

ఏపుగా ఎదిగి వున్న ఒక పండ్ల వృక్షం మీద చేరి కొమ్మల్ని రెమ్మల్ని ఇష్టం వచ్చినట్లు నాశనం చేస్తోంది చిన్న కోతుల గంపు.

భూతాన్ని చూసినట్లు బెదిరి, వికృత శబ్దాలు చేస్తూ క్రిందికి దూకింది అది. అడ్డు వచ్చిన ముళ్ళ పొదల మీది నుంచి హైజంప్స్ చేస్తూ దూరంలో వున్న ఒక పచ్చిక మైదానంలోకి పరుగు తీసింది.

ఆ సందడిని గమనించి మరింతగా రెచ్చిపోయింది కింగ్ కోబ్రా అని పిలువబడే ఆ భయంకర విషోరగం. ఈదురుగాలిలో చిక్కుబడిన చెట్లు వూగినట్లు అటూ ఇటూ వూగసాగింది.

తన చేతిలో వున్న చిన్న వెదురు కర్రను విసిరేసి, తను కూడా కోతుల గుంపు మాదిరి పిక్కబలం చూపిస్తే బాగుంటుందనిపించింది శ్రీకర్‌కి.

దగ్గిరి దగ్గిరిగా ఇరవై అడుగుల పొడవు వుండే ఆ విషపు జీవికి, ముక్కు చివరే వుంటుందిట విపరీతమైన కోపం. తన నివాస స్థలానికి దగ్గిరిగా వచ్చిన

ప్రాణిని ప్రాణాలతో వదిలి పెట్టటం అలవాటు వుండదుట దానికి. బర్మాదేశపు అడవుల్లో అధికంగా అగుపించే ఆ పాముల్ని గురించి తను విన్న విషయాల్ని గుర్తుకు తెచ్చుకుంటూ ఒక అడుగు వెనక్కి వేశాడతను.

ఆ కదలికను గమనించి ఇంకా ఇంకా ప్రజ్వరిల్లి పోవడం మొదలు పెట్టిందా పాము. ఇంకో పన్నెండు అందుళాల ఎత్తుకు లేచి, మెల్లి మెల్లిగా ముందుకు వాలడం ప్రారంభించింది.

అలా వాలినట్లే వాలి, ఏదో ఒక క్షణంలో పడగను అడ్డంగా తిప్పుతుందనీ, చిన్న సైజు చురకత్తుల మాదిరిగా వుండే కోరలు బయటికి కనిపించేలా నోటిని తెరిచి తన తల మీదకో, మెడ మీదకో కాటు అందుకుంటుందనీ శ్రీకర్‌కి తెలుసు.

తాచు పాము విషం కంటే ఎన్నో రెట్లు అధికమైన శక్తిని కలిగి వుండే ఆ పాము విషయం రక్తంలోకి ప్రవేశించిన మరుక్షణంలోనే ప్రాణాలు పోగొట్టుకోవడం డెఫినిట్.....ఆ మాట అనుకొనేసరికి చెమటలతో తడిసిపోయింది శ్రీకర్ ముఖం. వేపాకులు నమిలినట్లు చేదుగా తయారయింది నోరు.

ఊపిరి బిగపట్టి మెల్లిగా, అతి మెల్లిగా మరో అడుగు వెనక్కి వేశాడతను. ఆ కదలికను గమనించనే గమనించిందా సర్పం. స్టీమ్ ఇంజన్ మాదిరి రొద చేస్తూ ఛట్ మని విసిరింది పడగని.

"అయిపోయాను. నేను ఖతం అయిపోయాను. దిక్కు మొక్కులేని వాడి మాదిరిగా ఈ బర్మా అడవుల్లో ప్రాణాలు పోగొట్టుకుంటున్నాను......" జీరపడిన కంఠంతో బిగ్గిరిగా అరుస్తూ, దూకాడతను ఎడమ చేతివైపుకి.

అంగుళం...... సరిగ్గా అంగుళం తేడాతో అతని మెడను మిస్ అయిందా పాము. అందుకు ఎంతగానో అవమానం ఫీలవుతున్నట్లు, రెట్టించిన వేగంతో ఇంకోసారి ఎటాక్ చేయబోయింది.

నోరు తెరుచుకుని అలాగే చూస్తూ నిలబడితే పిడుగు పడిన చెట్టు మాదిరి నిలువెల్లా మాడిపోవడం గ్యారెంటీ అని అర్థమై, మెరుపు వేగంతో కదిలాడు శ్రీకర్. తన దగ్గిర వున్న వెదురు కర్రను గురి చూసి బలంగా ముందుకు విసిరాడు. అతను ఆ విధంగా ఎదురు తిరుగుతాడని ఊహించకపోవడం వల్ల కాబోలు, సరైన సమయంలో తలను వెనక్కి తీసుకోలేకపోయిందా పాము. గింగిరాలు తిరుగుతూ వచ్చిన కర్రముక్క దెబ్బకు మెలికలు తిరుగుతూ క్రింద పడిపోయింది.

దూరంగా పోయి పడిన కర్రముక్కను అందుకుని ఇంకో రెండు మూడు దెబ్బలు వేయాలని ఎంతగా అనిపిస్తున్నా, ఆ పని చేయలేదు శ్రీకర్.

చెమటలు పట్టిన అరిచేతుల్ని పాంటుకేసి రుద్దుకుంటూ వెనుతిరిగి పరుగు ప్రారంభించాడు.

దట్టంగా ఎదిగి వున్న ముళ్ళపొదలు తన దుస్తుల్ని చింపి పేలికలు చేస్తున్నా లెక్క చేయకుండా రెండు ఫర్లాంగుల దూరం పోయి, ఎదురుగా అగుపించిన ఒక పెద్ద కొండరాయి ముందు ఆగాడు.

ఎగసుకు వస్తున్న ఆయాసాన్ని అణుచుకునే ప్రయత్నం చేస్తూ తాపీగా నిలబడబోతుండగా అతని కర్ణేంద్రియాలకు చేరిందా శబ్దం.

ఎండకు ఎండి క్రిందికి రాలిన ముళ్ళ మండల మీదుగా బరువైన శరీరం ఏదో ముందుకు జరుగుతున్నట్లు.... మండలతో పాటు నేల మీద పడిన ఎండుటాకుల్ని చెల్లాచెదురు చేస్తున్నట్లు.....

దెబ్బతిన్న పాములు పగబట్టడం అనే మాట అసత్యమనీ, దెబ్బతీసిన మనిషిని వెతుక్కుంటూ రావడం కథల్లో తప్ప ఇంకెక్కడా కనిపించదనీ తెలిసి వున్నా అదిరిపడి కొండరాయి మీదికి ఎగబ్రాకకుండా ఆగలేకపోయారు.

కొండరాయి మీద నిట్టనిలువుగా నిలుచుని కనులు చిట్లిస్తూ పొదలకేసి చూస్తుండగా అతని చెవులకు చేరిందా చప్పుడు యింకోసారి.

అక్కడే నిలబడి అనవసరమైన రిస్కులు తీసుకోవడం ఇష్టంలేక కొండరాయి అవతలి ప్రక్కకు జంప్ చేయబోతుండగా, అతని దృష్టిపథంలోకి వచ్చింది ఆ యువతి.

నెత్తురు చారికలతో అట్టకట్టి అసహ్యకరంగా తయారైన చేతుల్ని ముందుకు జాచి నేలమీది ఎండుటాకుల్ని తడుముకున్నది. తలదాచుకోవటానికి సరయిన స్థలం ఏదైనా అగుపిస్తుందేమోనని ఆత్రుత నిండిన కనులతో వెతుక్కుంటున్నది.

తన మనసులో మెదిలిన ఆలోచనలకు సిగ్గుపడుతూ ఛెంగున క్రిందికి దూకి ఆమె వైపు పరిగెత్తాడు శ్రీకర్. అతని అడుగుల చప్పుడును ఆలకించి ఒక్కసారిగా అదిరిపడిందామె. అంతకుముందు అతను చూసిన పాము మాదిరిగా వేగంగా కదిలి వెనక్కి పారిపోయందుకు ప్రయత్నం చేసింది.

"శతృవును కాదు నేను....శ్రేయోభిలాషినే....నా వల్ల నీకు ఎటువంటి ప్రమాదము ఎదురుకాదు....ఆలోచన లేకుండా అటూ ఇటూ కదిలి నీ శరీరాన్ని గాయపరుచుకోకు....." ఆమె శరీరాన్ని పట్టుకుని నెత్తురు రుచి చూస్తున్న ముళ్ళమండల్ని జాగ్రత్తగా వెనక్కి లాగుతూ మృదుస్వరంతో హెచ్చరించాడు శ్రీకర్.

అలసటతో నిండి వున్న కనుల్ని పైకెత్తి అతని ముఖంలోకి చూసిందామె. పెద్ద గా విశ్వసించి ఒక్కసారిగా తలను వాల్చేసింది.

నొప్పి కలుగకుండా ఆమె భుజాల్ని పట్టుకొని మెల్లిగా అవతలికి లాగాడు శ్రీకర్.

చేతుల మాదిరిగానే ఆమె శరీరం కూడా దారుణమైన గాయాలతో నిండి వున్నది.... దుమ్ము, ధూళితో దుస్తులన్నీ అసహ్యకరంగా తయారై వున్నాయి.....

"మనిషి వాసన తగిలిన మరుక్షణం తటాలున మీద కాటువేసే పాములతోను దారుణమన బాధను కలిగించే విషపు ముళ్ళతోను నిండి వుండే ఈ ప్రదేశంలోకి నువ్వు ఎలా వచ్చావ్?" ముఖం మీదికి వాలుతున్న ఆమె ముంగురుల్ని మృదువుగా వెనక్కి నెడుతూ అడిగాడు శ్రీకర్.

"నీకు అనవసరమైన వ్యవహారంలో వేళ్ళు పెట్టటం మంచిది కాదు.... ఆమెను క్రింద పడుకోబెట్టి నీ దారిన నువ్వు వెళ్ళిపోవడం చాలా మంచిది" తుప్పు పట్టిన ఇనప గొలుసులు ఒకదానితో ఒకటి రాచుకుంటున్నట్లుండే కంఠంతో అతన్ని హెచ్చరించాడు అప్పుడే వచ్చిన ఆజానుబాహుడు ఒకతను.

ఉలిక్కిపడి తల తిప్పిన శ్రీకర్‌కి వెంటనే అగుపించారు. మరో ఇద్దరు ఆగంతకులు.

పదునైన పేష్కప్‌లను పట్టుకొని చాలా దూరం నుంచి వేగంగా పరిగెత్తుకు వస్తున్నట్లు ఆయాసంతో రొప్పుతున్నారు వారిద్దరూ.

"మీరందరూ ఎవరో నేను తెలుసుకోవచ్చా?" స్పృహలో లేని యువతిని క్రింద పడుకోబెడుతూ మర్యాద నిండిన కంఠంతో అడిగాడు శ్రీకర్.

"అధిక ప్రసంగం చేయడం నీ వంటికి మంచిది కాదు. మర్యాదగా అవతలికి వెళ్ళిపోకపోతే నీ కాళ్ళు చేతులు తిన్నగా వుండవు......." ఖంగు ఖంగుమంటున్న కంఠంతో వికృతంగా హెచ్చరిస్తూ ముందుకు అడుగు వేశాడు ఒక ఆగంతకుడు.

నిస్త్రాణగా పడి వున్న యువతిని భుజం మీదికి ఎత్తు కోవటానికే అతను అలా ముందుకు వస్తున్నాడని అనుకున్నాడు శ్రీకర్.

అనుకున్న రెండో క్షణంలోనే దారుణంగా తప్పిపోయింది అతని అంచనా.

"వేసే దెబ్బ ఏదో గట్టిగా వేయ్......ఏ మాత్రం అవకాశం దొరికినా మనకు దొరక్కుండా మళ్ళీ పొదల్లోకి పారిపోగలదు....వేసేయ్....." కీచు కంఠంతో తన సహచరుడిని హెచ్చరిస్తూ తను కూడా ముందుకు వచ్చాడు రెండో ఆగంతకుడు.

నోరు తెరుచుకుని చూస్తూ వుంటే జరుగరాని ఘోరం జరిగిపోతుందని అవగతమయ్యేసరికి చీమలు పాకినట్లు జలదరించింది శ్రీకర్ కంఠం.

తన దగ్గిర వున్న పేష్కప్‌ని పైకెత్తి, స్పృహలోలోని యువతి మీదికి వంగుతున్నాడు మొదటి ఆగంతకుడు. ఊపిరి బిగపట్టి ఆమె గుండెల మీద బలంగా పొడవబోతున్నాడు.

తనకు తెలియకుండానే కదిలాడు శ్రీకర్.

ఎడమ పాదాన్ని వేగంగా పైకెత్తి బలంగా తన్నాడు అతని భుజాల మీద, అనుకోని విధంగా తగిలిన ఆ దెబ్బను తట్టుకోడం చేతకాక, ఆశ్చర్యంగా చూస్తూ, అవతలికి దొర్లాడు అతను.

"నీకు సంబందించని వ్యవహారంలో చేయి పెట్టవద్దని చెబితే అర్ధంకావడం లేదు నీకు...... ఈ క్షణంలో నీకు ఈ భూమి మీద నూకలు చెల్లిపోయాయి......." పళ్ళు పటపటమని కొరుకుతూ ఎనుబోతు మాదిరి రంకె పెట్టాడు మొట్ట మొదటి అజానుభాహుడు.

తన ఆయుధాన్ని గాలిలోకి ఎత్తి ముందుకు లంఘించే అవకాశాన్ని అతనికి ఇవ్వలేదు శ్రీకర్.

పిడికిలి బిగించి బలంగా కొట్టాడు అతని ముఖం మీద. అదే ఊపులో క్రిందికి వంగి స్పృహలో లేని యువతిని అమాంతంగా ఎత్తి భుజం మీద వేసుకున్నాడు.

"పట్టుకోండి..... ఆ రాస్కెల్‌ని పట్టుకుని నడుములు విరగదీయండి....పట్టుకోండి ......." శ్రీకర్ కొట్టిన దెబ్బకు తీవ్రంగా గాయపడిన ముక్కును చేతులతో అదుముకుంటూ మిగిలిన వారిని హెచ్చరించాడు

ఆజానుబాహుడు. ఆ హెచ్చరికను ఆలకించి ఆ ఆగంకులిద్దరూ రియాక్ట్ కాకముందే ప్రక్కకు జంప్ చేసి పొదలకు అడ్డం పడ్డాడు శ్రీకర్.

"పట్టుకో..... దొంగ రాస్కెల్‌ని గట్టిగా పట్టుకో......." అని హెచ్చరించుకుంటూ అతన్ని అనుసరించారు ఆగంతకులు ఇద్దరూ రెండు క్షణాల తరువాత.

ఆ కాస్త వ్యవధిలోనూ పాతిక అడుగుల దూరం వెళ్ళాడు శ్రీకర్. మరో పది అడుగులు వేసిన తర్వాత మెదిలింది అతని మనసులో ఒక ఆలోచన.

"ప్రమాదకరమైన పరిస్థితిలోకి తీసుకు పోతున్నాను నిన్ను....... ఎటువంటి ఆపదా ఎదురుపడకూడదని దేవుడిని ప్రార్థించు....నువ్వు, నేనూ సురక్షితంగా అవతల పడాలని గట్టిగా కోరుకో......." భుజం మీద వున్న యువతిని తన మాటలు వినిపించవని తెలిసి కడా మృదు స్వరంతో అంటూ ముందుకే పరుగుతీశాడు.

అతనికీ తనకూ వున్న గ్యాప్‌ని అయిదు క్షణాల్లో అధిగమించి అతి దగ్గిరికి చేరుకున్నారు ఆగంతకులు.

"విసురు....పేష్కప్‌ని విసురు.....క్రిందపడి గిలగిలా కొట్టుకునేటట్లు నీ బలమంతా ఉపయోగించి విసిరేయ్......" ఆయాసాన్ని అణుచుకోవటానికి విఫల ప్రయత్నం చేస్తూ అరిచాడు ఒకతను.

ఆ మాటల్ని అక్షరాలా ఆచరణలో పెట్టటానికి చేతిని పైకెత్తాడు రెండో ఆగంతకుడు.

"ఎక్కడున్నావ్ బేబీ? ఇందాక నీ పడగకు అందలేదని బాధతో మంచం పట్టావా? నేను కొట్టిన దెబ్బకు కళ్ళు తేలవేసి ప్రాణాల్ని వదిలేశావా?" పెద్ద కంఠంతో అంతకుముందు తనను నిలువరించిన సర్పాన్ని పిలుస్తూ సుడిగాలిలా దూసుకుపోయాడు శ్రీకర్.

గురి సరిగ్గా చూడడం కోసం ఒక్క క్షణం పరుగును ఆపాడు పేష్కప్‌ని గాలిలోకి ఎత్తిన ఆగంతకుడు.

ఒంటికి తగిలిన మరుక్షణం ప్రాణాల్ని బలిపుచ్చుకునే ఆ పదునైన ఆయుధం అతని చేతుల్లో నుంచి విడివడకముందే, గుండెలు జలదరించేటట్లు వికృత శబ్దాన్ని వెలువరిస్తూ తన నివాస స్థలంలో నుంచి బయటికి వచ్చింది కింగ్ కోబ్రా.

అప్పటికే పది అడుగులు అవతలికి వెళ్ళిపోయిన శ్రీకర్‌ని గురించి పట్టించుకోలేదది.

అంతకు ముందు జిరిగిన అవమానానికి ప్రతీకారం చేయాలనే కోరికతో తపించిపోతున్నట్లు బుస్సున పడింది ఆ ఆగంతకుడి భుజాల మీద.

ఆ చుట్టుపట్ల వున్న చెట్లు చేమలు కంపించిపోయేటట్లు గావుకేక పెడుతూ విరుచుకుపడిపోయాడా వ్యక్తి. శరీరం నేలను తాకకముందే ప్రాణాల్ని కోల్పోయి అచేతనంగా వుండిపోయాడు.

ఆ దృశ్యాన్ని చూసి విపరీతమైన భయంతో వణికిపోయాడు అతని సహచరుడు. కొండరాయి దగ్గిరే వుండిపోయిన ఆజానుబాహుడిని ఎలుగెత్తి పిలుస్తూ ఆరు అడుగులు మాత్రమే వెనక్కి వేశాడు.

ఏదో అడుగు వేయకముందే వెనుక నుంచి అతని మెడ మీద కొట్టిందా పాము..... అతని భుజాల చుట్టూ చుట్టుకుని శివమెత్తినట్లు పడగను ఊపడం మొదలు పెట్టింది. గొంతు చినిగిపోయేటట్లు కేకలు పెడుతూనే, మెల్లిగా క్రిందికి జారిపోయాడు ఆ వ్యక్తి కూడా..... రెండే రెండు క్షణాల్లో విగత జీవుడైనాడు.

పరుగు పరుగున వచ్చిన ఆజానుబాహుడి వైపు కోరగా చూసి, రెండో ఆగంతకుడి భుజాల మీది నుంచి నేలమీదికి వాలింది ఆ పాము.

గాయపడి నెత్తురోడుతున్న తన ముక్కును ఆదుముకోవడం మరిచిపోయి అర్జంటుగా వెనక్కి తిరిగాడతను.... నాలుగే నాలుగు క్షణాల్లో కొండరాయి దగ్గిరికి పారిపోయి ప్రాణాలు కాపాడుకున్నాడు.

* * * * *

పొదలకు దూరంగా వున్న పచ్చినక మైదానాన్ని దాటి, ఎత్తయిన ఒక ప్రదేశంలో కట్టబడి వున్న ఆశ్రమ వంటి కట్టడం ముందు ఆగాడు శ్రీకర్.

విపరీతమైన బలం కలిగినటు వంటి దృఢకాయులు నలుగురు కలిసికట్టుగా పైకి ఎత్తితే తప్ప అంగుళం కూడా అవతలికి జరగని పెద్ద రాతి కల్వం ముందు కూర్చుని ఏవో ఆకుల్ని మెత్తగా నూరుతున్నాడు ఎనభై సంవత్సరాలకు పైబడిన వృద్ధుడు ఒకతను.

"నేను చెప్పిన మూలికలు నీకు లభించాయా? నేను చెప్పిన విధంగానే వాటిని సేకరించావా?" పంచిన తల ఎత్తకుండానే అడిగాడతను.

భుజం మీద స్పృహలేకుండా పడి వున్న యువతిని ఆశ్రమం ముందు భాగంలో కట్టబడిన ఒక మట్టి అరుగు మీద పడుకోబెట్టాడు శ్రీకర్.

"ఎటువంటి విషానికైననా విరుగుడు వేయగల అద్భుతమైన వైద్యుడి దగ్గిరికి నిన్ను తీసుకువచ్చాను. మందులు వేయడంలోనే కాదు – నీ వెంట బడిన ఎనుబోతుల వంటి దుర్మార్గుల పీచం అణచడంలో కూడా అందెవేసిన చేయి ఈ పెద్దమనిషిది. భయంతో గజగజలాడి పోవాల్సిన అవసరం ఇక నీకు లేదు. తెలివి తెచ్చుకుని కళ్ళు విప్పచ్చు" ఆమె బుగ్గల్ని మృదువుగా తడుతూ హెచ్చరించాడు.

అతని మాటని ఆలకించి కల్వం ముందు నుంచి లేచాడు ఆ వృద్ధుడు.

నాలుగే నాలుగు అంగల్లో స్పృహలేని ఆ యువతిని సమీపించి నాడిని పట్టుకున్నాడు.

ఉన్నట్లుండి ముడిపడ్డాయి అతని నొసలు.

"ఏమయింది? మీరు ట్రీట్ చేయలేని భయంకరమైన విషం ఏదైనా ఈమె శరీరంలోకి ప్రవేశించిందా?" ఆందోళనగా అడుగుతూ రంగులు మారుతున్న అతని ముఖంలోకి చూశాడు శ్రీకర్.

"విషమే గనుక ఈమె శరీరంలోకి ప్రవేశించి వుంటే ఆదుర్దా పడవలసిన అవసరం ఎంత మాత్రమూ వుండేది కాదు....ఈమెకు ఈ గతి పట్టించింది ఎవరో గాని, వెతుక్కుంటూ వచ్చేస్తున్నారు....." కనులతో పచ్చిక మైదానం వైపు చూపిస్తూ అన్నాడు.

అదిరిపడి అటుకేసి చూసిన శ్రీకర్‌కి అగుపించారు ముక్కు పగిలిన ఆజానుబాహుడు ఒంటరిగా లేడతను ..... వెంట వరుసగా వచ్చేస్తున్నారు మరో పది మంది ఆగంతకులు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=2350**

* * *

**Read other books of Madhu Babu @**

**http://kinige.com/kbrowse.php?via=author&name=Madhu+babu&id=20**